
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 35.5
కనిష్ఠం 23.8

ANDHRAJYOTHY



సూర్యాపేట

3

సోమవారం 19 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (312.5050)	68,721	71,288
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.60 (3.81)	971.86	565.92
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.57 (45.10)	50,000	16,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.170 | స్కిన్‌లెస్ : రూ.190

● రాఖీ సందడి



సోదరీసోదరుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సోమవారం ఉండటంతో పల్లె పట్టణం తేడా లేకుండా మహిళలు రాఖీలు కొనుగోలుచేస్తూ సందడి చేశారు. మిఠాయి, వస్త్రదుకాణాల్లో కొనుగోళ్లతో కిటకిటలాడాయి. ఇక నగరవాసులు స్వగ్రామం బాట పట్టడంతో జాతీయ రహదారులపై రద్దీ నెలకొంది.

● బోనమెత్తిన పల్లె



శ్రావణమాసం ఆదివారం కావడంతో పల్లె బోనమెత్తింది. వరుస సెలవులు, రాఖీ పౌర్ణమి కారణంగా పట్టణవాసులు పల్లెలకు చేరడంతో సందడి నెలకొంది. మహిళలు బోనాలు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పసుపు, కుంకుమ, చీర సారె సమర్పించి మొక్కు తీర్చుకొని చల్లంగ చూడాలని వేడుకున్నారు.

● పర్యాటక 'సాగరం'



అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌లో పర్యాటకుల రద్దీ నెలకొంది. ఇటీవల సాగర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండటం, గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటం, వరుస సెలవులు రావడంతో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సాగర్ ప్రాంతంలో సందడి నెలకొంది.



పత్తి రైతుల పరేషాన్

వర్షాభావానికి తోడు ఎండల కారణంగా పత్తిచేలు వాడుముఖం పట్టడంతో ఉమ్మడి జిల్లా రైతులు ఆందోళనలో చెందుతున్నారు. మే నెలాఖరున, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలతో తొలుత నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 3లక్షల ఎకరాలలోపు విత్తనాలు విత్తారు. ఆ తరువాత జూలై మొదటి వారంలో కురిసిన వర్షాలతో 5లక్షల ఎకరాలకు పత్తి సాగు విస్తీర్ణం చేరింది. కాగా, కొద్దిరోజులుగా వర్షాలు లేకపోవడం పత్తిచేలు వాడుపడుతున్నాయి. దీనికి తోడు ముడత తెగుళ్లు రైతులను వేధిస్తోంది.

\- నల్లగొండ

- ముఖం చాటేసిన వరుణుడు
- చాలా ప్రాంతాల్లో వాడుతున్న మొక్కలు
- ముడత తెగుళ్లతో దెబ్బతింటున్న చేలు
- తెల్లబంగారం దిగుబడులపై ప్రభావం
- నాన్ ఆయకట్టులో వరిసేద్యంపై నీలినీడలు

వర్షాలు లేక ఓ వైపు పత్తిచేలు వాడుపడుతుంటే మరోవైపు తెగుళ్ల నుంచి పత్తిని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పురుగు మందులను పిచికారీ చేస్తున్నా తెగులు అదుపులోకి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణశాఖ ఐదు రోజుల పాటు వర్షాలు ఉంటాయని ప్రకటించినా చినుకు జాడ మాత్రం లేదు. దీనికి తోడు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పత్తి పంటపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆదివారం నల్లగొండ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.5డిగ్రీలుగా నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 23.8 డిగ్రీలుగా ఉంది. వేసవిలా వానకాలంలో ఎండలు ఉండటంతో పత్తిచేలతో పాటు మెట్టపంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఎక్కడో ఒకచోట జల్లులు తప్ప సమృద్ధిగా ఎక్కడా వర్షాలు నమోదవడం లేదు. మెట్ట పంటలు పూర్తిగా వాడుముఖం పట్టగా, పత్తిగూడలు రాలడంతో పాటు తెగుళ్ల వేధిస్తున్నాయి.

రెండు నెలలుగా లోటు వర్షపాతం....

పత్తి విత్తనాలు వేసి 60 రోజులు అవుతోంది. నల్లగొండ జిల్లాలో 5.40లక్షల పత్తి సాధారణ విస్తీర్ణానికి ఇప్పటి వరకు 5లక్షల ఎకరాల్లో సాగైంది. రైతులు ఎన్నో ఆశలతో వానాకాలంలో పంటను సాగు చేయగా, వర్షాలు లేక పరిస్థితి తలకిందులైంది. జూన్ 1 నుంచి ఈనెల 18వ తేదీవరకు జిల్లాలో 281.8మి.మీల వర్షపాతానికి 302.3 మి.మీల వర్షం కురిసినట్లు సీపీవో కార్యాలయం పేర్కొంటోంది. ఈ 78రోజుల్లో 10.8మి.మీలు అధికంగా వర్షం కురిసింది. నల్లగొండ డివిజన్‌లో 7.2మి.మీలు, మిర్యాలగూడ డివిజన్‌లో 6.5మి.మీలు, దేవరకొండ డివిజన్‌లో 32.6మి.మీల వర్షపాతం అధికంగా నమోదైంది. చండూరుడివిజన్‌లో 2.2మి.మీల వర్షపాతం లోటు ఉంది. జిల్లా వ్యాప్తంగా 10.8మి.మీలు మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. జూన్‌లో 82.3మి.మీల వర్షపాతానికి 160.8 మి.మీల వర్షం కురవగా, 93.3మి.మీలు అధికంగా నమోదైంది. జూలై మాసంలో 128.9మి.మీల వర్షపాతానికి 108.4మి.మీలు కురిసింది. 15.9మి.మీలు వర్షపాతం లోటు ఏర్పడింది. ప్రస్తుత నెలలో 139.0మి.మీల సాధారణ వర్షపాతం నమోదు కావల్సి ఉంది.ఈ నెల 18వ తేదీవరకు జిల్లాలో 69.7మి.మీల సాధారణ వర్షపాతానికి 43.1మి.మీల వర్షం కురిసింది.ఈ 18రోజుల్లో 38.2మి.మీల లోటు వర్షపాతం నమోదైంది.



ఆందోళనలో పత్తి రైతులు

పత్తి రైతులు ఒక్కో ఎకరానికి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఎండు దుక్కుల నుంచి మొదలు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు మొత్తం కలిపి రూ.25వేల వరకు వ్యయమైంది. అయితే ప్రస్తత పరిస్థితులు చూస్తుంటే పెట్టుబడులు సైతం వచ్చేలా లేవని రైతులు వాపోతున్నారు. మరో వారం రోజుల్లోపు వర్షాలు కురవకపోతే పత్తిచేలు కోలుకునే పరిస్థితి ఉండదు.

ఎకరానికి పత్తి 10క్వింటాళ్ల నుంచి 12క్వింటాళ్లకు దిగుబడి రావల్సి ఉండగా, ప్రస్తుత పరిస్థితుల ప్రకారం 2 నుంచి 3క్వింటాళ్ల దిగుబడి వస్తుందో రాదో అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. మున్ముందు భారీ వర్షాలు నమోదైతేనే తెల్ల బంగారం ముందుపడుతుంది.

దేవరకొండ డివిజన్‌లో అత్యధికంగా వర్షాలు



నల్లగొండ జిల్లాలో దేవరకొండ డివిజన్‌లో అత్యధికంగా వర్షాలు కురిశాయి. దీంతో ఆ ప్రాంత రైతులు పంటలకు యూరియా, పొటాష్ వాడుతున్నారు. పత్తి చేల దశ 60రోజులకు చేరింది. మిగతా ప్రాంతాల్లో కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంటోంది. రైతులు ఇప్పటి వరకు 5లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 3లక్షల ఎకరాల్లో వరి సేద్యమైంది. సెప్టెంబరు 15 నాటికి మరో లక్ష ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉంది. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొన్నందున రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు.

\- పి.శ్రవణ్‌కుమార్ జేడీఏ, నల్లగొండ

నాన్ ఆయకట్టులో వరి సేద్యానికి అష్టకష్టాలు

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు నమోదు కాకపోవడంతో బోరుబావులు అడుగంటిపోతున్నాయి. బోర్లలో నీరు ఇంకిపోవడంతో వరి సేద్యానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. నాన్ ఆయకట్టులో బోరుబావులు ఆధారంగా రైతులు వరి సాగుచేశారు. నీరు అడుగంటడంతో బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 5.20లక్షల ఎకరాల్లో వరిసాగు కావల్సి ఉండగా, ఇప్పటి వరకు 3లక్షల ఎకరాల్లోపే వరిసేద్యమైంది. ఆయకట్టులో సెప్టెంబరు 15లోగా మరో లక్ష ఎకరాల్లో వరిసేద్యమయ్యే అవకాశం ఉంది. ఈ వానాకాలంలో 1.20లక్షల ఎకరాల్లో వరి సేద్యం తగ్గనుంది. ఇక నాన్ ఆయకట్టులో వరి సాగైన ప్రాంతాల్లో బోర్లలో నీరు లేకపోవడంతో వానాకాలం వరిపంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. చాలా చోట్ల రైతులు ఐదెకరాలు ఉంటే ఎకరం నుంచి రెండు ఎకరాలు మాత్రమే నాట్లు వేశారు. దీని ప్రధాన కారణం వర్షాలు లేకపోవడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోవడం. వారంలోపు సాధారణ వర్షాలు కురిస్తే పత్తిచేలు బయట పడుతాయి. భారీ వర్షాలు కురిస్తే పత్తి రైతులు గట్టెక్కడంతోపాటు వరిసేద్యం పెరగనుంది. వాతావరణశాఖ వర్షాలు కురుస్తాయని చెబుతున్నా ఆకాశంలో మబ్బులు కాన రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు రెండేళ్ల తర్వాత ఎగువ నుంచి భారీ స్థాయిలో వరద వచ్చి చేరుతోంది. దీంతో ఈ ఏడాది సాగర్ ఆయకట్టుకు సాగు నీరు, తాగు నీటి ఇబ్బందులు తీరినట్టే. అదేవిధంగా ఏడాది తరువాత ప్రాజెక్టు పరిధిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కాగా, ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుతామని జెన్‌కో అధికారులు చెబుతున్నారు.

\- నాగార్జునసాగర్, మేళ్లచెర్వు

ఏడాది తర్వాత విద్యుత్ వెలుగులు

సాగర్ విద్యుత్ కేంద్రంలో ఇప్పటి వరకు 267ఎం.యూ ఉత్పత్తి

ఈ ఏడాది లక్ష్యం 1,530ఎం.యూ

సాగర్ ప్రాజెక్టుకు గత ఏడాది వరద రాక లేకపోవడంతో ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేదు. ఈ ఏడాది ప్రస్తుత నీటి సంవత్సరంలో (జూన్ 1 నుంచి వచ్చే ఏడాది మే 31వరకు) జూన్ మొదటి వారంలో సాగర్‌కు ఎలాంటి నీటి రాక లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదు. జూలై 29వ తేదీ నుంచి ఎగువ నుంచి సాగర్‌కు వరద రాక ప్రారంభమైంది. దీంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని జెన్‌కో అధికారులు ప్రారంభించారు. అప్పటి నుంచి 20 రోజుల్లో 267మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం 8 టర్బైన్లు ఉండగా, ఒక్కో టర్బైన్‌కు 110ఎం.యూ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. కాగా, రెండో నంబరు టర్బైన్ గత ఏడాది మరమ్మతులకు గురైంది. దీంతో ప్రస్తుతం ఏడు టర్బైన్లద్వారా మాత్రమే విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1,530 ఎం.యూ కాగా, దీన్ని చేరుకుంటామని జెన్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

పులిచింతలలో 20ఎం.యూ విద్యుత్ ఉత్పత్తి

ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని సూర్యాపేట జిల్లా సరిహద్దులోని పులిచింతల వద్ద ఉన్న తెలంగాణ జల విద్యుత్ కేం ద్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 200 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 20 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. గత ఏడాది సరైన నీటి లభ్యత లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ఈ ఏడాది ఆగస్టు వరకు పులిచింతల ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి దిగువన ఉండటంతో జల విద్యుత్‌పై అనుమానాలు ఏర్పడ్డాయి. అయితే ఆగస్టు మొదటి వారంలో ఒక్కసారిగా పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగటంతో ఆగస్టు 9వ తేదీన ప్రాజెక్టు నీటిమట్టం 9టీఎంసీలకు చేరుకోగానే జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ఇప్పటి వరకు మొత్తం 20 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గత రికార్డులు దాటి అధిక మొత్తంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తామని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. పులిచింతల ప్రాజెక్టు కృష్ణా డెల్టా నీటి అవసరాల కోసం నిర్మించినందున ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకుంటాం

సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాద ఉన్నతాధికారులు నిర్ణయించిన 1,530 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటాం. గత ఏడా ది సాగర్ ప్రాజెక్టులో సరిపడా నీరు లేకపోవడంతో కేవలం 177 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను మాత్రమే ఉత్పత్తి చేశాం. ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టులో పూర్తి స్థాయి లో నీరు వచ్చి చేరింది. ఏడు టర్బైన్ల ద్వారా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాం.

\- మంగేష్‌కుమార్,జెన్‌కో సీఈ



సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఇలా..

నీటి సంవత్సరం	లక్ష్యం	ఉత్పత్తి (మిలియన్ యూనిట్లు)
2019-20	1,289	1,512.85
2020-21	1,290	1,248.78
2021-22	1,535	2,262.62
2022-23	1,500	177
2023-24	1,530	267

పులిచింతల ప్రాజెక్టు వద్ద విద్యుత్ ఉత్పత్తి ఇలా..

నీటి సంవత్సరం	లక్ష్యం	ఉత్పత్తి (మిలియన్ యూనిట్లు)
2016-17	-	13.241
2017-2018	-	6.62
2018-19	10	21.067
2019-20	12	209.89
2020-21	50	201.33
2021-22	170	314.557
2022-23	160	324.308
2023-24	200	102

పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

అదనపు కలెక్టర్ బీఎస్.లత



కలెక్టరేట్‌లో సర్వాయ్ పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ లత

సూర్యాపేట (కలెక్టరేట్),ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సర్వా యి పాపన్న జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాపన్నగౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గోల్కొండ కోటపై తన జెండాను ఎగురవేసి 12వేల మంది సైన్యాన్ని తయారు చేసిన యుద్ధవీరుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సయ్యద్ అక్బర్‌పాష, దున్న శ్యాం, డాక్టర్ గోపి, ఏవో సుదర్శన్‌రెడ్డి, గౌడ, కల్లుగీత సంఘం నాయకులు కక్కిరేణి నాగయ్యగౌడ్, గోవింద్, పల్స వెంకన్నగౌడ్, కక్కిరేణి సత్యనారాయణగౌడ్, బైరసన్ శ్రీనివాస్,రాపర్తిశ్రీను,తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగంపై నిర్లక్ష్యం సరికాదు

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీను

హుజూర్‌నగర్, ఆగస్టు 18: వ్యవసాయరంగాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీను, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు గుండు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు బోనస్, మద్దతు ధర ఇవ్వాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కలకత్తాలో జూనియర్ మహిళా డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలన్నారు. వైద్యుల భద్రతకు చట్టాలు చేయాలన్నారు. సమావేశంలో జక్కుల రమేష్, మామిడి నరసయ్య, జడ శ్రీనివాస్, ఇందిరాల వెంకటేశ్వర్లు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్‌ఎస్

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 18: కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రమాదబీమా చెక్కులను అందజేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను పార్టీ అధిష్ఠానం కంటికిరెప్పలా కాపాడుకుంటుందన్నారు. పార్టీని నమ్ముకొని పనిచేసే కార్యకర్తలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ ప్రమాదబీమా చేయించారన్నారు.

పోరాడి సాధించుకున్న తెలంగాణ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపగాని వెంకటనారాయణగౌడ్, మర్ల చంద్రారెడ్డి, తూడి నర్సింహారావు, జీడి భిక్షం, జూలకంటి సుధాకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, నర్సిరెడ్డి, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రం.. యాదగిరిక్షేత్రం

సంప్రదాయరీతిలో యాదగిరీశుడికి నిత్య పూజలు

స్వామివారి నిత్య ఆదాయం రూ.51,15,581

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 18: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో యాదగిరికొండ భక్తజన సంద్రమైంది.ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 38వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీగా కనిపించాయి. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ టికెట్ దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాలద్వారా రూ.51,15,581 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారలను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత



రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు.

రుణమాఫీ అందని వారికోసం ఇంటింటి సర్వే


నేటి నుంచి ఫిర్యాదుల పరిశీలన

అందుబాటులోకి రానున్న ప్రత్యేక యాప్



నల్లగొండ, ఆగస్టు 18: రుణమాఫీ ప్రక్రియ మూడు దశల్లో చేపట్టినా, సాంకేతిక కారణాలతో పలువురు అర్హులకు మాఫీ కాలేదని ఫిర్యాదులు రావడంతో ఈ వారంలో ఇంటింటి సర్వేకు ప్రభుత్వం నిర్ణయించింది. గ్రీవెన్స్‌లకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా రైతుల ఇళ్ల వద్దకు వ్యవసాయ శాఖ అధికారులు వెళ్లి సర్వే నిర్వహిస్తారు. నల్లగొండ జిల్లాలో 34 కేటగిరీల ద్వారా మండల వ్యవసాయశాఖ అధికారులు, జిల్లా అధికారులకు గ్రీవెన్స్‌ల నుంచి ఇప్పటికే రుణమాఫీపై 12,790 దరఖాస్తులు వచ్చాయి. నాలుగు రోజుల్లో 300 ఫిర్యాదులు వచ్చాయి. ఇంకా ఎవరైనా రైతులు అర్హత ఉండి రుణమాఫీ కాకపోతే మండల వ్యవసాయ అధికారులకు అర్జీ అందజేయాలని అధికారులు చెబుతున్నారు. ఈ దరఖాస్తులన్నింటినీ సోమవారం నుంచి పరిశీలించనున్నారు. ఇప్పటికే కొన్ని దరఖాస్తులను పరిశీలించి వారికి రుణమాఫీ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మూడు నాలుగు రోజుల్లో ప్రభుత్వం వ్యవసాయశాఖకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేనుంది. ఈ యాప్ అందుబాటులోకి వచ్చాక రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, ఈ నేపథ్యంలో ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించి రైతులకు రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. మొత్తానికి అర్హత ఉండి రుణమాఫీ కోల్పోతామనే ఆందోళనలో ఉన్న మాఫీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.







పార్టీ కోసం కష్టపడ్డా... పట్టించుకోవడం లేదు

● మనస్తాపంతో కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 18: కాంగ్రెస్ పార్టీని బలో పేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో కష్టపడినా తనను నాయకులు పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో ఓ కార్యకర్త ఆత్మహత్యా యత్నం చేశాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికులు, బాధిత కుటుంబస భ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని


తేజావత్ భగవాన్

ఇందిరమ్మకాలనీకి చెందిన తేజావత్ భగవాన్ (42) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కొనసా గుతున్నాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేశాడు. అయితే ఆదివారం బోనాల సందర్భంగా ఇందిరమ్మకాలనీలోని ముత్యాలమ్మ గుడి వద్ద శనివారం రాత్రి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో తన ఫొటో పెట్టకుండా అవమానించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల కాలంలో పార్టీలోకి వలసొచ్చిన కార్యకర్తలకు స్థానిక నేతలు ప్రాధాన్యమిస్తున్నారని, మొదటి నుంచి పనిచేసిన తనను పక్కన పెట్టారన్న ఆవేదన వ్యక్తం చేశాడు. మనస్తాపంతో ఒంటిపై పెట్రోల్ పోసు కుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. శరీరం కాలిపోయి తీవ్ర గాయాలైన భగవాన్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆటో డ్రైవర్‌గా కుటుం బాన్ని పోషిస్తున్న భగవాన్‌కు భార్య మంజులతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మెరుగైన వైద్యం అందించేంత ఆర్థికస్థోమత తమకు లేదంటూ బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త ప్రాణాలు కాపా డుకునేందుకు పార్టీ శ్రేణులు చేయూతనివ్వాలని భార్య ప్రాధేయపడుతోంది. కాగా ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొలనుపాకలో 8వ శతాబ్దానికి చెందిన
పశువైద్యుడి శిల్పం గుర్తింపు

● మూలికా వైద్యం చేసిన ఆధారాలూ లభ్యం
● చారిత్రక పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి


శిల్పాన్ని చూపుతున్న రెడ్డి రత్నాకర్‌రెడ్డి, మూలికా వైద్యానికి వినియోగించే వస్తువు


ఆలేరు రూరల్, ఆగస్టు 18: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో పశువైద్యుడి ప్రాధాన్యం తెలిపే శిల్పాన్ని గుర్తించా మని చారిత్రక పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి ఆదివారం తెలిపారు. కొల నుపాక సోమేశ్వరాలయంలోని నంది మండపంలో ఆలయ ద్వారానికి ఎడమ వైపున పశువైద్యుడి శిల్పం ఉందని, ఇది ఎనిమిది, తొమ్మిదో శతాబ్దా నికి చెందినదని తెలిపారు. పశువైద్యులకు ఎనిమిదో శతాబ్దం నుంచే ఎంతో ప్రాధాన్యం ఉందని అన్నారు. తోక పైకెత్తిన పశువు మలద్వారంలో వైద్యుడు చేతిని పెట్టి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు ఇందులో గుర్తించామన్నారు. ఆవులు, ఎద్దులకు లోపల పేగులు ముడిపడడం, పేడ వేయడంలో ఇబ్బందులు మొదలైన సమస్యలు ఉన్నప్పుడు, గర్భందాల్చిన విషయం తెలుసుకోవడానికి ఇలాంటి పరీక్షలు చేస్తారన్నారు. నాటి పాలకులు పశువైద్యులను గౌరవించి నట్లు, పాడి పరిశ్రమ అభివృద్ధికి పాటు పడినట్లు ఈ చిత్రం ద్వారా తెలు స్తోందన్నారు. మహాభారత కాలంలో నకుల, సహదేవులు గుర్రాలు, పశువు లకు వైద్యం అందించినట్లు చరిత్ర చెబుతోందని గుర్తుచేశారు. అలాగే, సోమే శ్వరాలయంలోనే మూలికా వైద్యం చేసినట్లు ఆధారాలున్నాయని, అందుకు సంబంధించిన వస్తువులను గుర్తించినట్లు తెలిపారు.













అనుబంధం.. ఆత్మీయత

అన్నాచెల్లెళ్ల పండుగ



భువనగిరి పట్టణంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రక్షాబంధన్ సందడి

సోదరీసోదరుల అనుబంధానికి ప్రతీకగా నిర్వహించే రక్షాబంధన్ సందడి ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నెలకొంది. సోమవారం రాఖీ పౌర్ణమి కావడంతో ఆదివారం రాఖీ విక్రయ కేంద్రాలు, స్వీట్ హౌస్‌లలో కొనుగోళ్లు పెరిగాయి. అదే సమయంలో ఆడపడచులకు కట్నాల రూపంలో ఇచ్చేందుకు వస్త్ర దుకాణాల్లో విక్రయాలు పెరిగాయి. జిల్లాలోని అన్ని గ్రామాలు, బస్తీల్లో రాఖీ విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయగా, మహిళలు కొనుగోళ్లతో సందడి చేశారు. మోత్కూరు మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని రాఖీల చీరతో అలంకరించారు.


- భువనగిరి టౌన్, మోత్కూరు, చౌటుప్పల్ టౌన్





నల్లగొండ జిల్లాకేంద్రంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు







మోత్కూరులో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, పెద్దమ్మతల్లిని రాఖీల చీరతో అలంకరించి కుంకుమార్చన నిర్వహిస్తున్న పూజారి

చెల్లితో రాఖీ కట్టించుకోవడం మధురానుభూతి



రాఖీ పౌర్ణమి సందర్భంగా చెల్లి చేత రాఖీ కట్టించుకోవడం మధురానుభూతి. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. నాకు చెల్లి ఉంది. సుమారు 45 ఏళ్లుగా ప్రతి ఏటా రాఖీ పండుగ రోజు నేను ఎక్కడ ఉన్నా నా వద్దకు వచ్చి రాఖీ కడుతుంది. ఈ సారి ఆమె జ్వరంతో బాధపడుతూ రాలేని పరిస్థితిలో ఉండి కొరియర్ ద్వారా రాఖీ పంపింది. ఆదివారం సాయంత్రం నాకు రాఖీ అందింది.

- చెల్లితో రాఖీ కట్టించుకుంటున్న కె.విద్యాసాగర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి, మోత్కూరు

ఎంతో సంతోషంగా ఉంది



మేము ఐదుగురం అన్నదమ్ములం, మా తోడ ఇద్దరు అక్కా చెల్లెళ్లు (నాకు ఒక అక్క, ఒక చెల్లి). రాఖీ పండుగ రోజు మా అక్కా, చెల్లి ప్రతి ఏటా మా ఐదుగురు అన్నదమ్ముల ఇళ్లకు వచ్చి రాఖీ కట్టిపోతారు. నేను ఎమ్మెల్యే అయ్యేక మా అక్కా, చెల్లి మరింత సంతోషంతో ఈ ఏడాది నాకు రాఖీ కట్టబోతున్నారు. సంతోషంగా ఉంది. నా తోబుట్టువులే కాకుండా ఉద్యమ సమయంలో రాఖీ పండుగ సందర్భంగా ఓ ఐదారుగురు మహిళా నాయకురాళ్లు నన్ను వారి సోదరునిగా భావించి రాఖీ కట్టేవారు.

- మందుల సామేల్, తుంగతుర్తి ఎమ్మెల్యే


నేనే వెళ్లి అక్కతో రాఖీ కట్టించుకునే వాడిని



నాకు ఒక్క అక్క ఉంది. వారిది వ్యవసాయ కుటుంబం. వ్యవసాయ పనుల్లో ఉండి ఆమెకు తీరిక ఉండేది కాదు. అయినా ప్రతి ఏటా రాఖీ పండుగ రోజు ఆమె వీలు చేసుకుని వచ్చి రాఖీ కట్టేది. ఆమె వృద్ధాప్యంతో నా వద్దకు రాలేని పరిస్థితిలో ఉండడంతో కొన్ని సంవత్సరాలు నేనే ఆమె వద్దకు వెళ్లి రాఖీ కట్టించుకునే వాడిని. ఆమె అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. రాఖీ కట్టించుకునే భాగ్యాన్ని ఆ భగవంతుడు నాకు దూరం చేశాడు.

- అక్కతో రాఖీ కట్టించుకుంటున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి

'సాగర్' 2 గేట్ల నుంచి నీటి విడుదల



నాగార్జునసాగర్ 2 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 18: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 20 రోజులుగా ఎగువ నుంచి వరద రాక కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం నాగార్జునసాగర్ ప్రాజెక్టు 2 క్రస్ట్‌గేట్లను 8 అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా పూర్తి స్థాయిలో ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు (215.8070టీఎంసీలు) కాగా శ్రీశైలానికి ఎగువ నుంచి 91,593 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 881 అడుగులుగా (193.4090టీఎంసీలుగా) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 68,721 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో సాగర్ నీటి మట్టం ప్రస్తుతం 590 అడుగులుగా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,067 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,110 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, 2 క్రస్ట్ గేట్లను 8 అడుగుల మేరకు ఎత్తి 24,920 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 71,288 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 68,721 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

పులిచింతల ప్రాజెక్టు గేట్లు మూసివేత

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు నుంచి శనివారం సాయంత్రం రెండు గేట్ల ద్వారా 43 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసిన ప్రాజెక్టు అధికారులు ఆదివారం ఉదయం ఈ రేడియల్ క్రస్ట్ గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, ఆదివారం సాయంత్రానికి 174.57 అడుగులు (45.10 టీఎంసీలు)గా ఉంది. కాగా ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 50వేల క్యూసెక్కులుగా నమోదు కాగా, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి మొత్తం అవుట్‌ఫ్లో 16వేల క్యూసెక్కులుగా నమోదైంది.

ఎగువనుంచి కొనసాగుతున్న వరద

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ జంటనగరాలతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కొద్ది రోజులుగా వరద దిగువన ఉన్న మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. శనివారం సాయంత్రానికి 768.05క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం సాయంత్రానికి 971.86క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్న మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.60అడుగులు (3.81టీఎంసీలు)గా ఉంది. ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి కాల్వకు 306.54క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 259.38క్యూసెక్కులు, మొత్తం 565.92క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నాగార్జునకొండపై 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండా

నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న నాగార్జున కొండపై స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీన 100 అడుగుల ఎత్తయిన జాతీయ జెండను ఆవిష్కరించారు. దేశ విదేశాల నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకులకు జాతీయ సమైక్యతా భావాన్ని, దేశ ఔన్నత్యాన్ని తెలియపరిచేందుకే ఈ జెండాను ఆవిష్కరించినట్లు నాగార్జున కొండ అధికారులు తెలిపారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకుల సందడి నెలకొంది. సాగర్‌కు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరడంతో సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. అంతేకాక నాగార్జునసాగర్ 2 క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్‌కు వచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, అనుపు, ఎత్తిపోతల, కొత్త వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లాంచీలను ఎక్కడానికి పర్యాటకులు ఎక్కువ మక్కువ చూపారు. దీంతో నాగార్జునకొండకు మూడు ట్రిప్పులను నడిపినట్లు లాంచీస్టేషన్ అధికారులు తెలిపారు. సుమారు 1000 మంది పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లినట్లు అధికారులు పేర్కొన్నారు.

అందుబాటులోకి విష్ణుపుష్కరిణి

● రోజురోజుకూ పెరుగుతోన్న పుణ్యస్నానాల సంఖ్య ● ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు



కొండపైన విష్ణుపుష్కరిణిపై ఏర్పాటు చేసిన నెట్

యాదాద్రి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోని విష్ణుపుష్కరిణి (కొండపైన గుండం)లో పుణ్యస్నానాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. చాలామంది భక్తులు కొండకిందగల లక్ష్మీ పుష్కరిణి కంటే కొండపైన విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భక్తులకు నామమాత్రపు రుసుము రూ.100తో అందుబాటులోకి తెచ్చారు. అయితే సంతానం కలగని దంపతులకు నామమాత్రపు రుసుంతో పూజారులతో పూజలు చేయించి, సాధారణ భక్తులందరికీ గుండంలో పుణ్యస్నానాలు ఉచితంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు కొండపైన నిద్రచేసి, కల్యాణకట్టలో తలవెంట్రుకలు సమర్పించుకుని... గుండంలో స్నానమాచరించే వారు. అదేవిధంగా సంతానం కలగని దంపతులు స్వామివారి సన్నిధిలోని విష్ణుపుష్కరిణిలో స్నాన సంకల్పం చేసిన పక్షంలో సంతానం కలుగుతుందన్న విశ్వాసం ఉంది. వీరు కూడా గుండంలో ప్రత్యేకంగా పుణ్యస్నానాలు చేసేవారు. అయితే 2016లో ప్రధానాలయం పునర్నిర్మించడంతో అప్పటినుంచి విష్ణుపుష్కరిణిలో కేవలం స్వామివారి కైంకర్యాలకోసం వినియోగిస్తున్నారు. భక్తులకోసం కొండ కింద గల లక్ష్మీ పుష్కరిణిలో స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులు కొండపైన పుణ్యస్నానాలు చేసేందుకు ఆసక్తి చూపడంతో అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో

ఇప్పటికే పుష్కరిణిలో కోతులు దూకకుండా, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను... గుండం చుట్టూ మంకీ గార్డు మాదిరిలో నైలాన్ వైర్ నెట్‌ను ఏర్పాటుచేశారు. పుణ్యస్నానాలు చేసిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు పురుషులు, మహిళలకు వేర్వేరుగా అల్యూమినియం ఫ్రేమ్, బ్యాషన్ బాలెన్ షీట్‌తో రెండు గదులను అందుబాటులోకి తెచ్చారు. భక్తుల సౌకర్యార్థం కొండపైన మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

త్వరలోనే యాదరుషి, ప్రహ్లాదుల మండపాల నిర్మాణం


కొండకింద గిరి ప్రదక్షిణ దారిలో యాదరుషి, ప్రహ్లాదులకు ప్రత్యేక మండపాలను నిర్మించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు మండపాలను రూ.6లక్షలతో నిర్మించే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ పనులు టెండర్ల ప్రక్రియ దశలో ఉన్నాయి. వీలైనంత త్వరలోనే పనులు మొదలు పెట్టేందుకు ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యాదరుషి, ప్రహ్లాదుల ప్రత్యేక మండపాల నిర్మాణం అంచనాలు పూర్తయ్యాయని, ఉన్నతాధికారులు సూచనతో త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు.

మామ మందలించాడని కోడలు ఆత్మహత్య

● యాదాద్రి భువనగిరి జిల్లా సురేంద్రపురంలో ఘటన

భువనగిరి రూరల్, ఆగస్టు 18: మనవడిని కొట్టొద్దని మామ మందలించడంతో మనస్తాపానికి గురైన కోడలు ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో ఈ సంఘటన జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామానికి చెందిన కె.శ్రీనివాస్‌రాజు కుమార్తె భార్గవి(28)కి ఖమ్మం జిల్లా వేంసూరు మండలం శంభునిగూడేనికి చెందిన సతీష్‌రాజుతో 2020, ఆగస్టు 26న వివాహమైంది. భర్త సతీష్‌రాజు, మామ సత్యనారాయణతో భువనగిరి మండలంలోని సురేంద్రపురిలో నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం భార్గవి తన రెండున్నరేళ్ల కుమారుడు శివ రామరాజుకు అన్నం తినిపిస్తూ కొట్టింది. అదే సమయంలో మామ సత్యనారాయణ కోడలిని మందలించడంతో మనస్తాపానికి గురైన ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న భర్త సతీష్‌రాజు కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని డాక్టర్ తెలిపారు. భార్గవి తండ్రి శ్రీనివాస్‌రాజు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



సైదులు (ఫైల్)

పాలకవీడు, ఆగస్టు 18: విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని బెట్టెతండాలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... బండావత్ సైదులు (30) బెట్టెతండా గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ భూమిలో పనిచేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ పోయింది. ట్రాన్స్‌ఫార్మర్ బ్రేక్ డౌన్ సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సైదులుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



సుదర్శన్ (ఫైల్‌ఫొటో)



శ్రీను (ఫైల్ ఫొటో)

కోదాడరూరల్, మునగాల, ఆగస్టు 18: సూర్యాపేట జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతి చెందారు. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురు మృతి చెందగా, టిప్పర్ ఢీకొని ప్రమాదంలో మరో యువకుడు మృత్యువాత పడ్డాడు.

కోదాడ మండలంలోని కాపుగల్లు క్రాస్ రోడ్డు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన కలకొండ సుదర్శన్ (27) కోదాడ పట్టణంలో గృహ నిర్మాణ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. కాపుగల్లు క్రాస్ రోడ్డు వద్ద లారీని క్రాస్ చేస్తూ, ఎదురుగా వస్తున్న మేళ్లచెర్వు గ్రామానికి చెందిన మంగళపల్లి విజయ్‌కుమార్ (23) ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు.

ఇద్దరు యువకులను 108 సహాయంతో కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ప్రమాదానికి అతివేగం, అజాగ్రత్తే కారణమని పోలీసులు కారణమని పోలీసులు పేర్కొన్నారు. విజయకుమార్ బాబాయి మరియందాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

టిప్పర్ ఢీకొని మరో యువకుడు

మునగాల మండలంలోని మాధవరం గ్రామంలో టిప్పర్ ఢీకొని ఒక యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నరసింహులగూడెం గ్రామానికి చెందిన రాంపంగు సురేష్ (32) ఎలక్ట్రీషన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన వ్యక్తిగత పని నిమిత్తం నేలమర్రి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై మాధవరం గ్రామ సమీపంలో నేలమర్రి స్టేజీ వద్ద బైక్ యూ టర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయంలో మట్టి తీసుకెళ్తున్న టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో సురేష్ టిప్పర్ టైర్ల కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి కోదాడ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మోటకొండూరు, ఆగస్టు 18: మండలంలోని తేర్యాల గ్రామంలో బాలల హక్కుల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. గత ఏప్రిల్‌లో జనగాం జిల్లా లోని బచ్చన్నపేటలో వివాహం చేయడానికి సిద్ధపడగా సమాచారం తెలుసుకున్న అధికారులు నిలిపివేశారు. తిరిగి బాలిక మేనమామ స్వగ్రామం మోటకొండూరు మండలంలోని తేర్యాల గ్రామంలో ఆదివారం గుట్టుచప్పుడు కాకుండా వివాహం నిర్వహించేందుకు ప్రయత్నాలు చేయగా చైల్డ్ హెల్ప్ లైన్(1098)కు సమాచారం రావడంతో వివాహాన్ని నిలిపివేశారు. బాలుడు, బాలిక, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వారిని భువనగిరిలోని సఖి సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ బండారు జయశ్రీ మాట్లాడుతూ మైనర్లకు వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పాండు, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు మల్లేష్, ఇస్తారి పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

అడ్డగూడూరు, ఆగస్టు 18: పిచ్చి కుక్క దాడిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవికాల్వలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బొమ్మగాని ఎల్లమ్మ ఆదివారం మంచినీళ్ల కోసం ఇంటి సమీపంలో ఉన్న నల్లా దగ్గరికి వెళ్లగా, పిచ్చి కుక్క వెంబడించి దాడి చేయగా, ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మహిళను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. అదే గ్రామంలో కుక్క మూడు గేదేపై దాడి చేసిందని స్థానికులు తెలిపారు.

మద్యానికి బానిసై..

గుండాల, ఆగస్టు 18: జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని నూనెగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరా ల ప్రకారం గ్రామానికి చెందిన తూనం మనోహర్ (36) మద్యం తాగుతూ నిత్యం భార్యతో గొడవపడేవాడు. దీంతో ఆమె కొద్ది రోజుల క్రితం బచ్చన్నపేటలో తన తల్లి గారి ఇంటికి వెళ్లింది. దీంతో మృతుడు ఒంటరిగా జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి నిద్రించగా, నిద్రలో మూర్ఛ వచ్చి మృతి చెందాడు. ఆదివారం వాసన వస్తుండటంతో గమనించిన చుట్టుపక్కన వారు పోలీసులకు, భార్యకు సమాచారం ఇచ్చారు. భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డెంగీతో బాలుడు..



ధనుష్ (ఫైల్)

తుర్కపల్లి, ఆగస్టు, 18: తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో ఓ యువకుడు డెంగీ జ్వరంతో శనివారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన మునిగంటి బ్రహ్మాచారి మునిగంటి పద్మావతి దంపతులకు చెందిన మునిగంటి ధనుష్ (18) రంగారెడ్డి జిల్లా హయాత్‌నగర్‌లో ఓ వేద పాఠశాలలో హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఐదు రోజుల క్రితం మాదాపూర్ గ్రామంలో ధనుష్ నానమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలకు ధనుష్ హాజరయ్యాడు. శుక్రవారం రోజు ధనుష్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఆ యువకుడికి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా ప్లేట్‌లెట్స్ సంఖ్య భారీగా తగ్గడంతో అతడి పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆ యువకుడి మృతితో ఆ కుటుంబం, గ్రామంలో విషాయ ఛాయలు అలుముకున్నాయి. చేతికందిన కొడుకు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనతో గ్రామస్థులను, బంధువులను కంటతడి పెట్టించాయి.

చికిత్స పొందుతూ ముగ్గురు మృతి



సంజయ్ (ఫైల్ ఫొటో)

నాగార్జునసాగర్, ఆగస్టు 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని పొ ట్టివానితండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పెద్దవూర ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని బహదూర్‌పురకు చెందిన మునిగల సంజయ్ (19) హైదరాబాద్‌లోని అవంతీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాగార్జునసాగర్ డ్యాంను చూడటానికి తన స్నేహితుడు గాద సందీప్‌తో కలిసి ఈ నెల 17వ తేదీన స్కూటీపై నాగార్జునసాగర్‌కు వచ్చారు. తిరిగి రాత్రి హైద్రాబాద్‌కు వెళ్తున్నారు. అదే సమయంలో పెద్దవూర నుంచి నాగార్జునసాగర్ వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సంజయ్ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సందీప్ చికిత్స పొందుతున్నాడు. మృతుడు సంజయ్ మేనమామ మాడిశెట్టి నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు..

నాగార్జునసాగర్: నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. పెద్దవూర పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తగూడెం స్టేజీ వద్ద బస్టాప్‌లో ఈ నెల 8వ తేదీన సుమారు 80 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు పడి ఉన్నాడు. గమనించిన ఎస్ఐ వీరబాబు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 16వ తేదీన మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వృద్ధుడికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్ నెంబర్లు 871260198, 9700125494 కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వీరబాబు కోరారు.



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

మునుగోడు రూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కల్వలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... నార్కట్‌పల్లి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన లింగాల యాదయ్య (68) మండలంలోని కల్వలపల్లి గ్రామంలో ఉంటున్న తన కుమార్తె వద్ద ఆరు నెలలుగా నివాసం ఉంటున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా కొద్ది రోజులుగా మనస్థాపంతో ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహార మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు యాదయ్య కుమారుడు నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న


వెలిశాలలో పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సామేలు


హుజూర్‌నగర్‌లో పాపన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు


పెన్‌పహాడ్: తంగెళ్లగూడెం గ్రామంలో నినాదాలు చేస్తున్న నాయకులు

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 18: బహుజన చక్రవర్తి, బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని వెలిశాల ఎక్స్ రోడ్డు సెంటర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని బహుజనులు పోరాడాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కుంభం సతీష్, నరేష్, జుమిలాల్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు తన్నీరు రాంప్రభు, మాజీ సర్పంచ్ ఆకుల వీరయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయా లని ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా తిరుమలగిరిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకుడు గిలకత్తు రమేష్ సర్వాయి పాపన్నపై రాసిన పాటల సీడీని విడుదల చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వై నరేష్, పేరాల వీరేష్, జుమ్మిలాల్, సుంకరి జనార్దన్, గిలకత్తుల ప్రియలత రాము గౌడ్, పాలకుర్తి రాజయ్య, కందుకూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: సర్దార్ పాపన్నగౌడ్ సేవలు మరువలేనివని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్ అన్నారు. మండలంలోని తంగేళ్లగూడెం గ్రామంలో సర్దార్ పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దేశ గాని నర్సయ్య, అబ్బగాని బిక్షం, మామిడి శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, శేఖర్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, దస్తగిరి, బిక్షం, లక్ష్మణ్, లక్ష్మినా రాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: సర్దార్ పాపన్నగౌడ్ జయంతి వేడుకలను మండలంలోని పోలుమళ్లలో నిర్వహించారు. పాపన్నగౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరు లింగరాజు, రేసు పాపయ్య, రేసు లింగయ్య, చామకూరి సుధీర్, ఆకుల మల్లేష్, ఆకుల అవిలయ్య, రేసు మహేష్, వెంకన్న, ఉపేందర్, తొట్ల మల్లయ్య, నాగార్జున, శ్యాంరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

నూతన్‌కల్: నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని మండలంలోని వెంకేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తొనుకునూరి సైదులుగౌడ్, పబ్బతి వెంకన్న, చిర్ర విజయ్, చిన్న సైదులు, బత్తుల శ్రీశైలం, బత్తుల జనార్దన్‌గౌడ్, బత్తుల యాదగిరిగౌడ్, తొన్కునూరి శ్రీను ఉన్నారు.

హుజూర్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలు సాధించాలని గౌడ సంఘం నాయకులు పండ్ల హుస్సేన్, తండు సాయిరాంగౌడ్, బెల్లంకొండ అమర్‌గౌడ్ కోరారు. పట్టణంలో పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనుల కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడన్నారు. ప్రభుత్వం జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనంతు శేఖర్, వల్లపుదాసు కృష్ణ, పులి గోవిందు, పండ్ల నాగరాజు, లింగారావు, రాంచందర్‌గౌడ్, నరసింహారావు, శేఖర్ పాల్గొన్నారు.

చిలుకూరు: మండలకేంద్రంలో జైగౌడ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైగౌడ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురగాని లింగయ్య, కొండా వీరబాబు, బెల్లంకొండ రాములు, నాగయ్య, బెల్లంకొండ నారాయణ పాల్గొన్నారు.

మఠంపల్లి: సర్దార్ పాల్వాయి పాపన్న ఆశయాలు సాధించాలని గౌడ సంఘం జిల్లా నాయకుడు వల్లపుదాసు మహేష్‌గౌడ్ అన్నారు. సర్దార్ పాపన్న జయంతిని మఠంపల్లిలో గౌడ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మఠంపల్లి- హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో కాసాని ఎల్లయ్యగౌడ్, రవిగౌడ్ బుడిగ హుస్సేన్‌గౌడ్, వి. జోస్‌గౌడ్, శంభయ్యగౌడ్, వీరయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హనుమంతుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, శంకర్‌గౌడ్, రామాంజిగౌడ్, రామయ్యగౌడ్, నర్సయ్యగౌడ్, నాగరాజు, సైదులు, శివగౌడ్, గుండుబాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండలకేంద్రంతో పాటు కీతవారిగూడెంలో కల్లు గీత కార్మికుల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ జనగాం జిల్లాకు పాపన్న పేరు పెట్టి, ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కల్లుగీత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల సైదయ్య, రావుల రాములయ్య, మామిడి భాస్కర్, నాగయ్య, బాదె నర్సయ్య, బొల్లెపల్లి శ్రీనివాస్, పెండెం ధనమూర్తి, సైదులు, రాంబాబు, వీరబాబు, పురుషోత్తం పాల్గొన్నారు.

కోదాడ రూరల్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని మండల పరిధిలోని గణపవరం గ్రామంలో వరవర రంగనాయక భాషా నిలయం గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ చైర్మన్ వట్టికూటి వెంకటేశ్వర్లు సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాపిశెట్టి సత్యం, పొట్టా కిరణ్, కుంటిగొర్ల నాగభూషణం, భీముడు, కొండా నరసింహారావు, బండి సత్యం, జంగం రామారావు, ఇర్ల నారపరెడ్డి, కాసాని సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూలి బాలుడు మృతి

● సోదరుడికి తీవ్ర గాయాలు ● ఇంట్లో ఆడుకుంటుండగా కూలిన ప్రహరీ


దండు మైసమ్మ గ్రామంలో ప్రహరీ కూలి మృతిచెందిన హిమాన్స్(ఫైల్)

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 18: చెరువు అలుగుపై ఉన్న కల్వర్టుపై నిర్మించిన ఇంటి ప్రహరీ కూలి రెండేళ్ల బాలుడు మృతిచెందాడు. అతనితో పాటు ఆడుకుంటున్న సోదరుడికి గాయాలయ్యాయి. ఆదివారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని దండు మైసమ్మ ఆలయ సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఆలయం పక్కన కొందరు చౌట చెరువు నుంచి వచ్చే వాగుపై చిన్న కల్వర్టులు నిర్మించి వాటిపై ఇళ్లు, దుకాణాలు నిర్మించుకొని వ్యాపారం చేస్తున్నారు. తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పోరేళ్ల వీరస్వామి-సరిత దంపతులు కొంత కాలంగా వాగుపై ఇల్లు కట్టుకొని దుకాణం నడుపుకుంటున్నారు. వారి ఇంటి పక్కన నెమ్మికల్‌కు చెందిన బీజిగ అనిత కూడా పక్కనే ఇల్లు కట్టుకొని దుకాణం నిర్వహిస్తోంది. ఈ రెండు ఇళ్ల మధ్య ఇటీవల అనిత ప్రహరీ నిర్మించింది. ఆదివారం ఉదయం సరిత ఇంటి ఎదుట కొబ్బరికాయలు విక్రయిస్తోంది. తమ్ముడు హిమాన్స్‌ను దేవాన్స్ ఆడుకుందామని ఇంట్లోకి పిలిచాడు. ఇద్దరు ఆడుకుంటుండగా కొద్ది సేపటికే ఇంట్లో నుంచి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో తల్లి సరిత ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ప్రహరీ కూలి ఇద్దరు పిల్లలపై పడి ఉంది. చిన్న కుమారుడు హిమాన్స్(2) అక్కడికక్కడే మృతిచెందాడు. పెద్ద కుమారుడు దేవాన్స్(5)కు తీవ్ర గాయాలయ్యాయి. గోడ మట్టి కుప్పల కింద రక్తపు మడుగులో చలనం లేని చిన్న కుమారుడు హిమాన్స్ గాయాలతో ఏడుస్తున్న దేవాన్స్‌ను చూసిన తల్లి కన్నీరు మున్నీరైంది. కళ్లెదుటే ఆడుకుంటున్న చిన్నారులు క్షణంలో రక్తపు మడుగులో కన్పించేసరికి తల్లి గుండెలవిసేలా ఏడ్చింది. గాయపడిన దేవాన్స్‌ను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. హిమాన్స్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాణ్యత లేని గోడ నిర్మాణంతో గోడ కూలి ప్రమాదం జరిగినట్లు హిమాన్స్ తల్లి పోరేళ్ల సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి : సీపీఎం

మఠంపల్లి, ఆగస్టు 18: ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలు నాయక్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలుగా గిరిజనులు పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. పడావుపడిన భూముల్లో పంటలు పండిచుకుంటున్నారని, అర్హులైన రైతులందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. మఠంపల్లి మండలంలో 2,700 ఎకరాల భూములు ఉండగా 24 మందినే అర్హులుగా గుర్తించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో సర్వేచేసి భూములపై కబ్జాలలో ఉన్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ పట్టాలు ఇవ్వకుంటే జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో శానంరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి నాయకులు కోటయ్య, రాము, వినోద్, సాయి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సూర్యనారాయణ క్షేత్రంలో పూజలు


సూర్యనారాయణ క్షేత్రంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి, ఆగస్టు 18: జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో అఖండ జ్యోతిస్వరూప సూర్యనారాయణ క్షేత్రంలో ఆదివారం మహా సౌర హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సౌర ఆరాధకులు జనా ర్దన్‌స్వామి, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు. అదేవిధంగా రేఖ చారి టబుల్ ట్రస్టు ఫౌండేషన్ చైర్మన్ బోయినపల్లి రేఖ అర్వపల్లి యోగనంద లక్ష్మినర్సింహస్వామి దేవాలయంలో జరిగి పూజల్లో పాల్గొన్నారు. దేవాలయంలో రూ.లక్షతో బోరు వేయించి మంచినీటి సౌకర్యం కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో పద్మ, శేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి, ఆగస్టు 18: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-05 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. 19 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు తమ కుటుంబ యోగక్షేమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. నాటి రోజులను పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఛత్రునాయక్, ఉపాధ్యాయులు అమృతారెడ్డి, శ్రీనివాస్, వెంకటరెడ్డి, ప్రభాకర్, ఆంజనేయశర్మ, విద్యార్థులు కొత్తపల్లి నాగరాజు, జిట్టబోయిన నాగరాజు, చిలుకూరి రవి, నజీమా, రమ్య, నాగేశ్వరరావు, సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

'పద్మశాలీల సమస్యలు పరిష్కరించాలి'

హుజూర్‌నగర్, ఆగస్టు 18: పద్మశాలీల సమస్యలు పరిష్కరించాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకులు చిన్నం వీరమల్లు, నామని కుమారస్వామి, ఉదారి యాదగిరి కోరారు. పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పద్మశాలీలు రాజ్యాధికారం సాధించాలన్నారు. సంఘంలో ప్రతి ఒక్కరూ సమాజహితం కోసం పనిచేయాలన్నారు. ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాజ్యాధికారంతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుర్రం మార్కండేయులు, సోమయ్య, గుర్రం శ్రీనివాస్, దీకొండ లక్ష్మీనారాయణ, దీకొండ వెంకటేశ్వర్లు, నరేష్, హైమేష్, సత్యనారాయణ, బాలకృష్ణ, రాజేందర్, గోలి శ్రీను, అంకయ్య పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లించాలి

నాగారం, ఆగస్టు 18: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ట్రాన్స్‌కో మండల ఏఈఈ మహేంద్రకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని వర్ధమానుకోట, ఫణి గిరి, నాగారం గ్రామాల్లో విద్యుత్ మొండి బాకాయిల స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. గృహజ్యోతి వినియోగదారులను మినహాయించి ఇతర విద్యుత్ వినియోగదారులు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వారు, పరిశ్రమల యజమానులు బిల్లులు గడువులోగా చెల్లించి విద్యుత్ సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ కృష్ణారావు, లైన్‌మెన్లు సమ్మయ్య, సాగర్ పాల్గొన్నారు.


బకాయిల జాబితా చూపుతున్న ట్రాన్స్‌కో ఏఈఈ మహేంద్రకుమార్

తల్లీ సల్లంగా చూడు..


మేళ్లచెర్వులో...


కోదాడలో దేవాలయం వద్ద బోనాలు సమర్పిస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలి వెళ్లి ముత్యాలమ్మ తల్లి ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేశారు. అమ్మవారికి నైవేద్యం, చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అందరూ సుఖ సంతోషంతో ఉండాలని, పాడి పంటలు సిరి సంపదలు సంవృద్ధి చెందాలని భక్తులు కోరుకున్నారు.


నేరేడుచర్లలో..


చిలుకూరు: నారాయణపురంలో బోనాలతో మహిళలు


మేళ్లచెర్వు మండలకేంద్రంలో బోనాలు చెల్లిస్తున్న భక్తులు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

నేరేడుచర్ల, ఆగస్టు 18: నేరేడుచర్లలో నిర్మించిన ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. ఆలయంలో ప్రతిష్ఠించనున్న గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ, మాలికాపురోతమ, అయ్యప్పస్వామి, బలిపీటాలు, కీర్తి ధ్వజ స్తంభాలకు వేద మంత్రోచ్చరణల మధ్య జలాభిషేకం, ధాన్యాధివాసం, పుష్పాభిషేకం నిర్వహించారు. వేద పండితులు ఇరువంటి వెంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ జొన్నపట్ల కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి, కొణతం చిన వెంకటరెడ్డి, నాగండ్ల శ్రీధర్, యారవ సురేష్, దొంతిరెడ్డి వెంకటరమణారెడ్డి, మన్నెం దుర్గారావు, చిన్నపల్లి శ్రీనివాస్, యామిని వీరయ్య, పూర్ణచంద్రారెడ్డి, ఐల శ్రీను, కొణతం రాంరెడ్డి, హరి పాల్గొన్నారు.


యాగశాలలో పూజల్లో పాల్గొన్న భక్తులు

'ధరణి' పేరుతో దందా

● హక్కుదారుడి పేరు మార్పునకు డబ్బులు డిమాండ్

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

కోదాడ రూరల్, ఆగస్టు 18: వారసత్వ భూమికి ధరణిలో పేరు మార్పునకు తహసీల్దార్ కార్యాలయంలో డబ్బులు అడిగారని బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తండ్రి చనిపోయినప్పుడు వారసులకు భూమి మార్పిడి కోసం తహసీల్దార్, సిబ్బంది రూ.లక్ష డిమాండ్ చేశారని బాధితులు ఆరోపించారు. మండలంలోని కాపుగల్లు గ్రామానికి చెందిన నర్రా గురుప్రసాద్ ఇటీవల మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతని పేరు మీద ఆరు ఎకరాల 37కుంటల భూమి ఉంది. ఆ భూమిని తమపేరు మీద మార్చాలని గురుప్రసాద్ భార్య నర్రా పద్మ, కుమారులు నర్రా కోటేశ్వరరావు, నర్రా భరత్ గత సంవత్సరం సెప్టెంబరు 29వ తేదీన రూ.50 వేల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు. స్లాట్ బుక్ చేసుకున్న బాధితులు అప్పటి కంప్యూటర్ ఆపరేటర్, తహసీల్దార్, ఆర్ఐలను కలిశారు. నర్రా గురుప్రసాద్ పేరు మీద ఉన్న భూమిని భార్య, కుమారుల పేరు మీద పౌతి చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారని, అంత డబ్బు తాము ఇవ్వలేమని రూ.50వేలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం రూ.50 వేలను అప్పటి తహసీల్దార్, ఆర్ఐకు ముట్టజెప్పారు. అప్పటి నుంచి బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. తమ భూమిలో ఇళ్లు ఉన్నట్లు రికార్డులో నమో దైందని, ఇందుకు సంబంధించి కలెక్టర్ ఆఫీస్‌కు ఫైల్ పంపించాల్సి ఉంటుందని, ఫైల్ సరిచేసేందుకు మరో రూ.50 వేలు అడుగుతున్నారని చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. లేకుంటే మీరే కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్లి ఫైల్ సరిచేసుకుని వస్తే తాము రిజిస్ట్రేషన్ చేస్తామని బాధితులు పేర్కొన్నారు. లేనిచో రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. తహసీల్దార్ సాయిగౌడ్, ఆర్ఐ సుజిత్‌కుమార్‌లపై ఈ నెల 12వ తేదీన కలెక్టర్ తేజో నందాలాల్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ కోదాడ ఆర్డీవోను ఆదేశించారు. ఆర్డీవో తమ వాం గ్మూలం తీసుకొని కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు బాధితులు తెలిపారు. ఈ విష యమై ఆర్డీవో సూర్యనారాయణను వివరణ కోరగా, బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి ఈనెల 14వ తేదీన కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం



మఠంపల్లి, ఆగస్టు 18: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో స్వామికి ఆదివారం విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాభోది నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. ఉదయం 9:30గంటలకు లక్ష్మీనృసింహుని పరిణయోత్సవ క్రతువు ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహుని మూర్తులను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి విశ్వక్సేనారాధన వేదపండితులు నిర్వహించారు. భక్తులు పీఠాలపై ఆసీనులై స్వామివారి కల్యాణం యజ్ఞోపవీత మాంగాల్య ధారణల యథావిధిగా జరిగాయి. 11 గంటలకు రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహర్నివేదనలు నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలోనూ బ్రహ్మ ముహూర్తంలో ఏకాదశ రుద్రాభిషేకం, పంచాయతన పూజలు అర్చకులు నిర్వహించారు.

సైదులు ఆశయాలు సాధించాలి

అనంతగిరి, ఆగస్టు 18 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చేసిన షేక్ సైదులు ఆశయాల సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో ఆదివారం జరిగిన షేక్ సైదులు ద్వితీయ వర్ధంతిలో మాట్లాడారు. సైదులు లేని లోటు పార్టీకి, గ్రామానికి, కుటుంబానికి తీర్చలేనిదన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ముత్యాలు, మండల కార్యదర్శి రాపోలు సూర్యనారాయణ, మండల నాయకులు జుట్టుకొండ వీరయ్య, సురభి లక్ష్మి, బిక్షమయ్య పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడిగా వెంకటేశ్వర్లు



హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 18: సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడిగా గుండు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. తన నియమాకానికి సహకరించిన పార్టీ వెంకటేశ్వర్లు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. ఆయన నియామకం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అనంతగిరి, ఆగస్టు 18: మండల పరిధిలోని త్రిపురవరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల 2003 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన లాల్ సాహెబ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి మృతిచెందడంతో ఆదివారం తనతో పాటు చదువుకున్న మిత్రులు రూ. 60 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మట్టపల్లి నాగరాజు, ఉపేందర్, మట్టపల్లి కాశీనాథం, భూక్య రాంమూర్తి, నాగెల్లి నాగరాజు, చిట్యాల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలకేంద్రానికి చెందిన విలేకరి బోయిండ్ల చంద్రశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అలని చిన్ననాటి స్నేహితులు, తోటి వాలీబాల్ క్రీడాకారులు ఆదివారం చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమవంతు సహాయంగా రూ.1.57లక్షలు అందజేశారు. కార్యక్రమంలో హైమద్, వీరన్న, శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవ్, వీరారెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, లతీఫ్ ఉన్నారు.

పావని తల్లిదండ్రులకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నాగారం, ఆగస్టు18: మండంలోని డి. కొత్తపల్లి గ్రామంలో ఈ నెల 15న పాత కక్షలను మనస్సులో పెట్టుకుని కాసం సోమయ్య-మంజులపై ప్రత్యర్థుల దాడిలో వారి కూతురు కాసం పావని మృతిచెందింది. తలిదండ్రులకు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రూ.25 వేల ఆర్థిక సాయం పంపారు. మాజీ ఎమ్మెల్యే పంపిన నగదును మాజీ సర్పంచ్ యరాల నర్సింహారెడ్డి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు పడిశాల లింగయ్య ఆదివారం అందజేశారు. పావని మృతికి కారణమైన నిందితులకు శిక్షపడే వరకు బీఆర్ఎస్ న్యాయ పోరాటం చేస్తామని అన్నారు.

మంద కృష్ణమాదిగను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



తిరుమలగిరి, ఆగస్టు 18: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను తిరుమలగిరి సంఘం నాయకులు ఆదివారం హైద్రాబాద్‌లో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కందకూరి సోమన్న, ఎంఎస్ఎఫ్ జిల్లా అద్యక్షుడు చల్లగుండ్ల సోమయ్య, కందుకూరి శ్రీను, మెల్కపురి రాంబాబు, ఇటుకల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'నిందితుడిని కఠినంగా శిక్షించాలి'

నూతన్‌కల్, ఆగస్టు 18: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని వైద్య విద్యార్థిని కె.ప్రసన్న కోరారు. ఆదివారం మండల పరిదిలోని ఎర్రపహాడ్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో రోజు రోజుకు అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడిన వారిపై ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి త్వరగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో శివాణి, కావేరి, బిందుశ్రీ, శ్రావణి, సోని, భవాణి, గౌతమి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితం గడపాలి



హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 18: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక జీవితం గడపాలని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి హుజూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే విజయాలు సాధించవచ్చన్నారు. భగవత్ గీత గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. ప్రతి ఒక్కరు సమాజ హితం కోసం పనిచేయాలన్నారు. సమాజంలోని అనేక రుగ్మతలకు ఆధ్యాత్మికతే పరిష్కారమార్గమన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ, మహేష్, అరుణా, నరసింహారావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్



తుంగతుర్తి, ఆగస్టు 18: అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా కొండగడుపుల ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం అంబేడ్కర్ యుజన సంఘానికి జరిగిన ఎన్నికల్లో ఆయన తన సమీప అభ్యర్థి పోలెపాక రాజీవ్‌పై 27ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా మల్లెపాక సైదులు, ప్రధాన కార్యదర్శిగా బంగారు మనోజ్, కోశాధికారిగా ఇమ్మడి శ్రీకాంత్, గేమ్స్ సెక్రటరీగా బొంకూరి మనోజ్, కల్చరల్ సెక్రటరీలుగా మరికంటి అశోక్, కత్తుల నరేందర్, మల్లెపాక రాంబాబు నియమితులయ్యారు.